ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025

నందివానివలసలో ఏనుగుల తిష్ట

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని నందివానివలస తామర చెరువులో ఏనుగులు తిష్ట వేశాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అడవి ఏనుగులను తరలించడంలో పూర్తి విఫలమైనట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏనుగులను తరలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పినప్పటికీ చేతల్లో శూన్యమని ప్రజలు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికే అనేక మందిని బలిగొన్న ఏనుగులు గుంపు ఇంకెన్ని ప్రాణాలు తీస్తాయోనని భయపడుతున్నారు.

వారానికి వంద

- దర్జాగా వసూళ్ల దందా
- ఉపాధి హామీ చట్టంలో చాపకింద నీరులా అవినీతి
- టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లే పాత్రదారులు
- డబ్బులు చెల్లిస్తేనే మస్తరు నమోదు
- జిల్లా అధికారులకూ వాటాలు

మండుటెండలో పనులు చేస్తున్న వేతనదారులు

జిల్లాలో ఉపాధి హామీ చట్టం అవినీతి కూపంలో కూరుకుపోయింది. గుట్టుచప్పుడు కాకుండా వసూళ్ల దందా కొనసాగుతోంది. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా ఉపాధి హామీ చట్టాన్ని అధికారులు అవినీతి కూపంలోకి నెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. పని చేసిన కూలీలు వారానికి వంద రూపాయలు చెల్లించాల్సి ఉంది. చెల్లించిన తర్వాతే కూలీలకు పని చేసినట్లు మస్తరు నమోదవుతోంది. పని ప్రదేశాల్లోనే వంద రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. డబ్బులివ్వకపోతే మస్తరు నమోదులో కూలీలకు ఇబ్బందులు తప్పని పరిస్థితి. చాపకింద నీరులా విస్తరించిన ఈ అవినీతి బాగోతంలో పాత్రధారులు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లే. మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు వసూలు చేసిన ముడుపులు అందుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ అవినీతి బాగోతం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ఉపాధి హామీ చట్టం కింద పని చేస్తున్న ప్రతి కూలీ నుంచి వారానికి వంద రూపాయలు వసూలు చేస్తుంటే జిల్లా వ్యాప్తంగా కోట్లలో వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధి కూలీల రెక్కల కష్టాన్ని అధికారులు దర్జాగా దోచుకుతింటున్న తీరు విస్తుగొలుపుతోంది. మంత్రి సంధ్యారాణి సొంత జిల్లాలో ఉపాధి హామీ చట్టంలో కాకులను కొట్టి గెద్దలను మేపుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు మండలంలోని పెదపధం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ చట్టం కింద జరుగుతున్న పనులను విలేకరులు పరిశీలించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పంచాయితీ పరిధిలో దుక్కడవలస సమీపంలో ఉన్న నాయుడు చెరువు, పెదపదం దగ్గరలో ఉన్న కంపు చెరువు పనులు చేస్తున్న కూలీల కష్టాలను పరిశీలించగా ఆశ్చర్యకరమైన వాస్తవాలు బయటపడ్డాయి. పెదపదం పంచాయతీలో 25 గ్రూపులు ఉపాధి పనులు చేస్తున్నాయి. ఒక్కో గ్రూపు లో 20నుంచి 30మంది కూలీలు పని చేస్తున్నారు. అంటే ఈ పంచాయతీ నుంచి వారానికి వంద రూపాయల చొప్పున అన్ని గ్రూపుల నుంచి సుమారు రూ.50వేల వరకు వసూలు జరుగుతోంది. నెలకు రూ.2లక్షల మేర కూలీల నుంచి దండుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా జిల్లాలోని అన్ని పంచాయతీలలో పని చేస్తున్న కూలీల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మండుటెండలో ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. పని చేసి అలసిపోతే సేదతీరడానికి టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. దాహమేస్తే తాగేందుకు మంచినీటి సౌకర్యం కూడా లేదు. ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు మండుటెండలో పని చేయాల్సిందేనని, పని ప్రదేశంలో ఎలాంటి సౌకర్యాల్లేవని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. వారానికి వంద రూపాయలు చెల్లించిన తర్వాతే మస్తరు నమోదు చేస్తున్నారని చెప్పారు. డబ్బులివ్వకపోతే మస్తరు నమోదుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఇబ్బంది పెడతారని తెలిపారు. మేట్ల ద్వారా వంద రూపాయల చొప్పున వసూలు చేస్తారని చెప్పారు. వాస్తవాలను తాము బయటకు చెపితే తమకు పని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి తమ పేర్లు వార్తల్లో రాయొద్దనీ ప్రాధేయపడ్డారు.

మెటీరియల్ నిధుల కోసం బోగస్ మస్తర్లు

ఉపాధి హామీ పథకంలో 60 శాతం కూలీల భాగస్వామ్యంతో పనులు చేయించాల్సి ఉంది. ఈ విధంగా కూలీల భాగస్వామ్యంతో పనులు చేస్తే మిగిలిన 40శాతం మెటీరియల్ కాంపొనెంట్ కింద పనులకు నిధులు మంజూరవుతాయి. దీనికోసం చాలా గ్రామాల్లో బోగస్ మస్తర్లతో పనులు చేయిస్తున్నట్లు రికార్డులు నిర్వహిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉపాధి కోసం దూరప్రాంతాలకు వలస వెళ్ళిన వారి పేర్లు, దుకాణాలు, చిరు వ్యాపారుల పేరిట ఉపాధి పనులు చేస్తున్నట్లు బిల్లులు డ్రా చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి బాగోతం గుట్టు చప్పుడు కాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లతో అధికారులు నడిపిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

నెలకు రూ.నాలుగు కోట్ల దందా

జిల్లాలోని 15మండలాల్లో 70 శాతం మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. వీరంతా ఉపాధి హామీ చట్టం కింద పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా గిరిజన మండలాలు ఉన్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవులే ఎక్కువ మంది ఉన్నారు. జిల్లా అంతటా సగటున లక్ష మంది కూలీలు పని చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. వారానికి వంద రూపాయలు చొప్పున నెలకు రూ.4కోట్లు రూపాయల వరకు వసూళ్ల దందా జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. వసూలు చేసిన సొమ్ములు మండల, జిల్లా స్థాయి అధికారులకు చేరుతున్నాయి.

బలిపశువులు ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉపాధిహామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్లే ఎక్కువగా బలవుతున్నారు. అవినీతి, అక్రమాల కు కేంద్ర బిందువులుగా వారే మారుతున్నారు. అధికారపార్టీ నాయకులు, ఉన్నతాధికారులు వారినే లక్ష్యంగా చేసుకుని అవినీతికి బాధ్యులను చేస్తున్నారు. స్థానిక నాయకుల ఒత్తిళ్ల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లు ఎక్కువగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనేది స్పష్టంగా కనిపిస్తోంది. వారానికి వంద వసూళ్ల దందాలో టెక్నికల్ అసిస్టెంట్, ఎపిఒ, జిల్లా అధికారులకు వాటాలు వున్నప్పటికీ బలయ్యేది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే. రాజకీయ వేధింపులు, కక్షలకు ఎక్కువగా గురవుతున్నది కూడా వారే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలో జిల్లాలో సుమారు పది మంది ఫీల్డ్ అసిస్టెంట్లపై జిల్లా అధికారులు వేటు వేశారు. ఎమ్మెల్యేల ఒత్తిళ్ల కారణంగా జిల్లా అధికారులు అవినీతి ఆరోపణల సాకు చూపి తొలగించి కొత్త వారిని నియమించుకుంటున్నారు. ఇటు ఉన్నతాధికారులు, అటు రాజకీయ నాయకుల ఒత్తిళ్ల వల్ల అనేక మంది ఫీల్డ్ అసిస్టెంట్లు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ పథకంలో జరుగుతున్న కొండంత అవినీతిలో ఫీల్డ్ అసిస్టెంట్లకు మిగులుతున్నది గోరంత అయినప్పటికీ వారినే బలిపశువు లుగా మారుస్తున్నారు.

సోషల్ ఆడిట్ షో

ఉపాధి హామీ చట్టం కింద జరుగుతున్న పనుల్లో అవినీతి, అక్రమాలను వెలికి తీయడానికి ఏటా ప్రతి మండలంలో సోషల్ ఆడిట్‌లు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలకు చెందిన కొంతమంది ప్రయివేటు వ్యక్తులు గ్రామాల్లో తిరిగి కూలీలను విచారించి నివేదికలు అందజేస్తున్నారు. అయితే ఇవి కేవలం షో మాదిరిగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలో నిర్వహించే ప్రజా తనిఖీ వేదికలు మొక్కుబడిగా తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. కొద్దినెలల క్రితం సాలూరు ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా తనిఖీ వేదికలో జిల్లా జలయాజమాన్య సంస్థ పిడి రామచంద్రరావు సమక్షంలోనే సోషల్ ఆడిట్ డొల్లతనం బయటపడింది. ఫీల్డ్ అసిస్టెంట్లంతా డబ్బులు ఎత్తుకుని సోషల్ ఆడిట్ సిబ్బందిని మేనేజ్ చేశారని సిపిఎం నాయకులు ఎం.శ్రీనివాసరావు బహిరంగంగానే ఆరోపించారు. జిల్లా అధికారి సమక్షంలో ఇంత జరిగినా బాధ్యులపై చర్యల్లేని పరిస్థితి కనిపించింది. సోషల్ ఆడిట్ పై పబ్లిక్ హియరింగ్‌కు హాజరైన జిల్లా అధికారికి, ఎస్ ఆర్పీ, పిఆర్పీలకు వారివారి స్థాయిని బట్టి ముడుపులు అందజేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మునాయుడు

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సదస్సులో వక్తలు విమర్శించారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులపై రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను సదస్సులో నాయకులు ఎత్తి చూపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు అధ్యక్షతన జరిగిన సదస్సులో తొలుత జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడారు. ఈ ఏడాది బడ్జెట్లో జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణంలో ఉన్న జంఝావతి, అడారుగెడ్డ, కారిగెడ్డ, వనకబడి, పెద్దగెడ్డ ప్రాజెక్టులకు నిధులు నిల్ గానే ఉన్నాయని అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు పూర్తికి అధికారులు రూ.590 కోట్లు అడగ్గా ఉద్యోగుల భత్యం కోసం ఇచ్చిందని రూ.47 కోట్లు విడుదల చేసిందని, ఇది చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కోట్ల రూపాయలతో అమరావతికి ఖర్చు చేస్తామంటున్న చంద్రబాబుకు వెనుకబడిన పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధి అవసరం లేదానని ప్రశ్నించారు. ఆది నుంచీ జిల్లాకు జరుగుతున్న అన్యాన్ని పోరాడి తిప్పికొట్టాలని, అందుకు తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసితుల రైతుల పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు పిలిలుపునిచ్చారు. అందులో భాగమే ముందు రైతులు సంతకాలు చేసి గ్రామ సచివాలయాల వద్ద ఈనెల 21 నుంచి 24 వరకు నిరసనలు తెలియజేసి వినతులు అందిస్తామన్నారు. అనంతరం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. సదస్సులో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, కరణం రవీంద్ర పలువురు రైతులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై 14 నుంచి శిక్షణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16 వరకు మూడు రోజులపాటు తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ డాక్టర్ డొల్లు పారినాయుడు తెలిపారు. కెరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ప్రధాన శిక్షకులుగా విశ్రాంత ఐఎఎస్ అధికారి జె మురళి వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. 15 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి పదవ తరగతితో పాటు ఆపై చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉన్నత చదువులు, పోటి పరీక్షలలో ఎలా విజయం సాధించాలి, బృంద కార్యక్రమాలు, నిర్వహణ హార్ట్‌ఫుల్ నెస్ ధ్యానం ద్వారా తెలివితేటలను ఎలా పెంచుకోవచ్చు, యూత్ సెమినార్లు, మూవీ చిత్ర ప్రదర్శన, తదితర అంశాలపై ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాల్గొనే వారికి ఉచిత వసతి తోపాటు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శిక్షణా కార్యక్రమానికి సంబంధించి పేర్లు నమోదు చేసు కోదలచిన వారు డోల్లు నవజీవన్ 9177114333,డి వాసుదేవరావు 8179012050, మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని డాక్టర్ పారినాయుడు తెలిపారు.

వంతెన పనులు తక్షణమే ప్రారంభించాలి

పూర్ణపాడు - లాబేసు వంతెనను పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని 42 గిరిజన గ్రామాల ప్రజలకు ఎంతో అవసరమైన పూర్ణపాడు లాబేసు వంతెన పెండింగ్ పనులను తక్షణమే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం వంతెన నిర్మాణం చేస్తున్న ప్రదేశాన్ని, ఆగిపోయిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్ణపాడు-లాబేసు వంతెన పెండింగ్ పనులు ప్రారంభించాలని ఈనెల 26న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను చేపట్టినట్టు తెలిపారు. ముందుగా ఆదివారం ప్రజా సంఘాల సాధన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ నాయకులు హెచ్.రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ 1996లో అటు ఒడిశా- ఆంధ్రా సరిహద్దులో వనిజ గ్రామం వద్ద పడవ ప్రమాదం జరిగి 36 మంది గిరిజనులు చనిపోవడం జరిగిందన్నారు. ఆ సందర్భంలో అధికారంలో ఉన్న టిడిపి నాయకులు వంతెన కడతామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ హామీ అమలు చేయకపోవడంతో 2006లో సిపిఎం ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అసెంబ్లీలో నిలదీయడంతో రూ.3.50కోట్లుతో 2006లో వంతెన పనులు ప్రారంభమయ్యాయని, అయితే నేటికి 19 ఏళ్ల అయినా మూడు పిల్లర్లు కట్టడంలో అటు పాలకులు పూర్తిగా విఫలం అయ్యారని విమర్శించారు. ఈరోజు పాలకులు అధికారంలో ఉండేటప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉండేటప్పుడు ధర్నాలకు, రాస్తారోకులకు, రిలే నిరాహార దీక్ష వద్దకు వచ్చి ఒక మాట మాట్లాడుతూ గిరిజన ఓట్లు దండుకుంటూ పదవులు పొంది, ఆ తర్వాత ఈ వంతెన పూర్తి చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని ధ్వజమెత్తారు. అమరావతికి కోట్లాది డబ్బులు ఖర్చు పెడుతున్న నేపథ్యంలో కేవలం రూ.15 కోట్లు ఈ వంతెనకు ఇచ్చి కట్టలేరా అని పాలకులను ప్రశ్నించారు. కొమరాడ మండలానికి 31 పంచాయతీలకు సంబంధించి 9 పంచాయితీలు 42 గ్రామాలకు సంబంధించిన ఈ వంతెన పనులు వెంటనే ప్రారంభించి ఈ వేసవిలో నాగావలి నదిలో నీరు పూర్తిగా తగ్గిన నేపథ్యంలో వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేసి గిరిజన ప్రజలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ వంతెన కురుపాం నియోజకవర్గానికి సంబంధించి ఐదు మండలాలకు ఉపయోగకరమైందని, ఇలాంటి వంతెనను పాలకులు పట్టించుకోకుండా వదిలేయడం సరికాదని అన్నారు. ఈ వంతెనను సాధించుకునే దిశగా పార్టీలకు అతీతంగా అన్ని ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు ఏకమై మే 26న కొమరాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘ నాయకులు వెంకటేశు, కొండ గొర్రె అప్పలస్వామి, పకీరు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన వంతెనను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - సాలూరు

ఆర్మీ జవాన్ మురళి నాయక్ వీర మరణం పొందిన సందర్భంగా ఆయన చిత్రపటానికి రాష్ట్రమంత్రి గుమ్మడి సంధ్యారాణి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మురళి నాయక్ వంటి వీర సిపాయిలు దేశం గర్వించదగిన వారని, దేశ రక్షణలో తమ ప్రాణాలను అర్పించడం గొప్ప త్యాగమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ జవాన్ కుటుంబానికి అండగా నిలుస్తుందన్నారు. మురళీ నాయక్ త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆమదాల పరమేష్, నాయకులు కొనిసి చిన్ని, కె.భీమా, కె.చంద్రరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నివాళ్లు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

వీరజవాన్ మురళి నాయక్‌కు ఘన నివాళి

బలిజిపేట : పాకిస్తాన్‌లో జరిగిన కాల్పుల్లో మృతి చెందిన వీరజవాన్ మురళీనాయక్‌కు ఆదివారం మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు, యూత్ ప్రెసిడెంట్ ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళ్లు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. మురళి తన ప్రాణాన్ని దేశ ప్రజలకు అంకితం చేసి, ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల జాబితాలో తన పేరును రాసుకున్నారని సంజీవునాయుడు కొనియాడారు. మన కుటుంబాల రక్షణ కోసం తన కుటుంబం గురించి ఆలోచించకుండా ప్రాణాలను పెణంగా పెట్టిన మురళీ నాయక్‌ను యువత ఆదర్శంగా తీసుకొని దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. కార్యక్రమంలో కోట శాంతి, గేదెల రవి, నేతాజీ గ్రంథాలయం యువత కోట గౌరీనాథ్, పెంకి పరశురామ్, శ్రావణ్, దత్తి కృష్ణవేణి, గుల్లిపల్లి రాజు (సన్యాసి నాయుడు), కోట కేశవ, వడిగల్ల సాంబమూర్తి, పూసర్ల గౌరీశంకర్, వెంకటరావు, దత్తి పార్వతమ్మ, బంకురు సీతాలు, కొట్నాన సత్యనారాయణ, గుల్లిపల్లి అర్జున, ఆటో యూనియన్ నాయకులు కోట శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, యువత

సీతానగరం: మురళీనాయక్‌కు నివాళిగా మండలంలోని లక్ష్మీపురంలో విద్యార్థులు, యువత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి నాయక్ జోహార్లు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సత్యం, త్రినాధ్, శ్రీనివాసులు, రామేశ్వరరావు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆ యువకుడి కోసం గాలింపు చర్యలు

ప్రజాశక్తి - సాలూరు

కోనసీమ జిల్లా అమలాపురంలో పాకిస్తాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసిన యువకుడి కోసం స్థానిక పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసిన యువకుడు సాలూరులో వున్నట్టు విజయనగరం జిల్లా పోలీసులకు అమలాపురం పోలీసులు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన స్థానిక పోలీసులు సాయంత్రం 4 నుంచి యువకుడి కోసం గాలిస్తున్నారు. దీనిపై టౌన్ సిఐ అప్పలనాయుడు ని వివరణ కోరగా తమకు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా అమలాపురం మండలం కామన గురువు పంచాయతీలోని మిక్సర్ కాలనీకి చెందిన పూజారి ఏసు కుమారుడు రాజుగా గుర్తించామన్నారు. ప్రస్తుతం ఇతడు విశాఖలో ఉన్నట్టు సమాచారం ఉందని పోలీసులు తెలిపారు.

డిగ్రీ కళాశాలల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాలు

- గత ఏడాది లో జాబ్ మేళా ల్లో 1080మందికి ఉద్యోగాలు
- ఎపి నైపుణ్య శిక్షణాభివృద్ధి కేంద్రం జిల్లా మేనేజర్ సాయి కృష్ణ చైతన్యతో ప్రజాశక్తి ముఖాముఖి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంప్లాయ్ బిలిటీ స్కిల్ సెంటర్ల ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఎపి నైపుణ్య అభివృద్ధి కేంద్రం జిల్లా మేనేజర్ సాయి కృష్ణ చైతన్య చెప్పారు. తమ సంస్థ ఆధ్వర్యాన జిల్లాలో జరుగుతున్న కార్యకలాపాల గురించి ఆయన ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు. - ప్రజాశక్తి పార్వతీపురం

◆ గత ఏడాది ఎన్ని జాబ్ మేళాలు నిర్వహించారు? ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారు?

2024-25లో జిల్లాలో 17 జాబ్ మేళాలు నిర్వహించాం. ఈ మేళాలకు సుమారు 3వేల మంది హాజరయ్యారు. వీరిలో 1080మంది వేర్వేరు రంగాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

◆ ఏఏ రంగాల్లో ఉద్యోగాలకు జాబ్ మేళాలు నిర్వహించారు?

ఐటి, ఫార్మా, మాన్యుఫాక్చరింగ్, రిటైల్, బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగాలకు జాబ్ మేళా లు నిర్వహించాం. ఆయా కంపెనీల అవసరాన్ని బట్టి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. డబ్ల్యుఎన్ఎస్, ఆర్ వైకె సాఫ్ట్వేర్ సొల్యూషన్స్,కాల్ సెంటర్లలో ఐటి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హెటిరో డ్రగ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మెడ్ ప్లస్, అపోలో ఫార్మసీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎకోహెూమా, ఓరియంట్ ఎలక్ట్రిక్ వంటి తయారీ రంగం కంపెనీలకు ఎంపికయ్యారు.

◆ ఏడాదిలో ఎన్ని జాబ్ మేళాలు నిర్వహించాలి?

ఏడాదిలో 20 జాబ్ మేళాలు నిర్వహించాలనేది సంస్థ నిర్దేశించిన లక్ష్యం. దీనికి అనుగుణంగా ప్రతి నెలా ఒక నియోజకవర్గంలో ఒక జాబ్ మేళా నిర్వహించాలి. ఈ ఏడాదిలో ఇంత వరకు ఒక జాబ్‌మేళా పార్వతీపురం భాస్కర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించాం. ఐటి, ఫార్మా రంగాల్లో కంపెనీలకు 102 మంది ఎంపికయ్యారు. సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించాల్సి ఉంది. గత నెలలో కొన్ని కారణాల రీత్యా వాయిదా పడింది.

◆ స్కిల్ హబ్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటిలో ఎంతమందికి శిక్షణ కల్పిస్తారు?

జిల్లాలో నాలుగు స్కిల్ హబ్‌లు ఉన్నాయి. నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో స్కిల్ హబ్ ఏర్పాటు చేశాం. సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పార్వతీపురం మండలంలో ఎంఆర్ నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కురుపాంలో జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, పాలకొండలో సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో స్కిల్ హబ్‌లు ఉన్నాయి. ఒక్కో హబ్‌లో 120 మందికి చొప్పున 480 మందికి శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానించాం. బ్యాచ్‌కు 30మందిని ఎంపిక చేసి శిక్షణ కల్పిస్తాం. పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో గల స్కిల్‌హబ్‌ల్లో ఐటి రంగానికి సంబంధించిన శిక్షణ, సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో ఆటోమొబైల్, టైలరింగ్ రంగాల్లో శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తు లు కోరాం.





◆ ఎంప్లాయబిలిటీ స్కిల్ సెంటర్లు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఏఏ నైపుణ్య శిక్షణలు ఇస్తున్నారు?

జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంప్లాయ్ బిలిటీ స్కిల్ సెంటర్ల ద్వారా నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నాం. కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్ అంశాల్లో శిక్షణ కల్పిస్తాం. పార్వతీపురంలో భాస్కర్ డిగ్రీ కళాశాల, సాయిరాం డిగ్రీ కళాశాల, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, గాయత్రీ డిగ్రీ కళాశాల, ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలకొండలో శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాల, తమ్మినాయుడు డిగ్రీ కళాశాలల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ అందుతోంది.

◆ ఎంప్లాయబిలిటీ స్కిల్ సెంటర్లకు ప్రభుత్వం ఏఏ మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది?

ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో ఉన్న ఎంప్లాయబిలిటీ స్కిల్ సెంటర్లలో 30 ల్యాప్ టాప్‌లు, 30 ట్యాబ్‌లు, 2 టీవీలు అందజేశాం. వీటి ద్వారా డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందజేస్తారు.

ఏరియా ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక మల్టీస్పెషాల్టీ ఏరియా ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. సాధారణ జబ్బులకు గురై ఇప్పటికే అనేక మంది గిరిజనులు మృత్యువాతపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆసుపత్రి పనులపై ప్రతి సమావేశంలో తూతూ మంత్రంగా సమీక్షలు చేస్తున్నారే తప్ప పూర్తికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవని విమర్శించారు. సీతంపేటలో ఏరియా ఆసుపత్రిలో 15 మంది వైద్యులున్నా, రోగులకు సరిపడా బెడ్‌లు లేక ఇతర ఆసుపత్రులకు కేసులు రిఫరల్ చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ ఏడాది జూన్ ప్రారంభం నాటికి ఏరియా ఆసుపత్రి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చెప్పడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రోగులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

51 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస జంక్షన్ వద్ద గల శ్రీ సత్య సాయి నిత్య అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్య అధికారి ఎస్.జాక్సన్ 51 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మందిని ఎంపిక చేసి శస్త్ర చికిత్సల కొరకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి నిర్వాహకులు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్చార్జి సిహెచ్ వెంకటరమణ, సిబ్బంది, రోగులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తీరు అమానుషం

ప్రజాశక్తి - పాలకొండ

కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అమానుసంగా ఉందని వైసిపి పెన్షనర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు వై లిల్లీపుష్పనాథం అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల సంక్షేమం కంటే రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అణిచివేత ధోరణినే చూపిస్తుందని ఆరోపించారు. మాజీ మంత్రి విడుదల రజిని పై సిఐ చేసిన దౌర్జన్యం చూస్తే కూటమి ప్రభుత్వం అరాచకం అర్థమైపోతుందన్నారు. గుంటూరు జిల్లా కంతేరు లోను దళిత ఎంపిటిసి కల్పనను మహిళ అని చూడకుండా రాత్రి సమయంలో అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పోలీసులను పావులుగా వాడుకొని వైసిపి కార్యకర్తలను నాయకులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

గర్భిణులకు రొట్టెలు, పండ్లు అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

ఘనంగా మదర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు

అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వైటిసిలో గల గర్భిణుల వసతి గృహంలో మదర్స్ డే వేడుకలను నీడ్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు. మాట్లాడుతూ మాతృ బంధాలు సమాజంలో తల్లులను గౌరవవించే వేడుకని, తల్లి చేసిన త్యాగాలు మాటల్లో చెప్పలేనివని అన్నారు. తల్లి ప్రేమను కొలవలేమని, ఆమె ఒంటరిగా బాధలను భరిస్తుందని, కానీ మనకు ఒక్క క్షణమైనా బాధకలగకుండా చూసుకుంటుందని వివరించారు. అనంతరం బ్రహ్మకుమారీల బృందం కేక్ కట్ చేసి, గర్భిణులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. తల్లి పిల్లలపై చూపించే అపారమైన ప్రేమను గుర్తించడానికే మదర్స్ డే ఉందని తెలిపారు. వాసవీ క్లబ్ ప్రెసిడెంట్, క్లబ్ ఉమెన్ ప్రెసిడెంట్ ఆధ్వర్యాన పండ్లు, రొట్టెలు, న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైటీసి మేనేజర్ విద్యాసాగర్, నీడ్ సేవా సంస్థ బృందం మోహనరావు, కనకరత్నం, వసంత బ్రహ్మ కుమారీ సిస్టర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

సైబర్ నేరాలపై గిరిజనులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ క్రైమ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి సమీపంలోని గుజ్జుపాడు గ్రామాల్లో గిరిజనులకు సైబర్క్రైమ్, రహదారి భద్రతా నియమాలు, చెడు వ్యసనాలకు బానిస కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ వాడుతున్న ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. రకరకాల నెంబర్లతో ఫోన్ చేసి ప్రలోభాలకు గురిచేసి మోసాలు చేస్తారని చెప్పారు. అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆదివారం క్రీడా పోటీలను నిర్వహించారు. పిల్లలకు కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ గ్రామర్, తెలుగు గ్రామర్, క్విజ్ పోటీలు, నిర్వహించామని శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరానికి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో పాటు, జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటు న్నారని చెప్పారు.

వేసవి శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

వ్యాపారుల దగా

- పడిపోయిన ధర
- కానరాని కొనుగోలు కేంద్రాలు
- లబోదిబోమంటున్న జీడి రైతులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

జీడిపిక్కలను పండించే రైతులు వ్యాపారస్తులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి సాలూరు ప్రాంతంలో నెలకొంది. ఏడాది పొడవను కష్టపడి సాగు చేస్తూ నాణ్యమైన జీడిపిక్కలను పండించడమే కానీ వీరికి పంట చేతికొచ్చేసరికి ఎప్పుడూ మోసపోవడమే జరుగుతుంది. అలాగే ఈ ఏడాదీ జరిగింది. వారం రోజుల కిందటి వరకు కిలో జీడిపిక్కల ధర రూ.168 ఉండేది.

గత నాలుగు రోజుల నుంచి అక్కడక్కడ కురుస్తున్న వర్షాలకు జీడిపిక్కల రంగు మారిపోయాయి. వీటిని సుదూర ప్రాంతాల్లో అమ్మకానికి పెడితే ఎవరూ కొనరని అందువల్లే రేట్లు తగ్గించాల్సి వస్తుందని దళారీలు రైతులతో వాదిస్తున్నారు. గత కొంతకాలంగా నల్లగా ఉన్నా, తెల్లగా ఉన్నా ఇదే రేటు ఇచ్చి ఎటువంటి ఎంపికలు చేయకుండా కొనుగోలు చేసిన వ్యాపారస్తులు అమాంతంగా వర్షం సాకు చూపించి ధరలను తగ్గించడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితి. ఇక్కడి వ్యాపారస్తులంతా సిండికేట్ అయ్యి అమాంతంగా రూ.140కు ఒకేసారి తగ్గించడంతో రైతులంతా నష్టపోవడమే తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. జీడికి మంచి మద్దతు ధర వస్తుందని, జీడిపిక్కలు పండించే గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాల ద్వారా జీడిపిక్కలను కొనుగోలు చేస్తామని సాక్ష్యాత్తు రాష్ట్ర మంత్రి హామీ ఇచ్చినా అటువంటి పరిస్థితులు ఎక్కడా కనిపించటం లేదు. దీంతో స్థానిక వ్యాపారస్తులు వారికి నచ్చిన ధరను, నచ్చిన పిక్కలను ఎంపిక చేసుకొని కొనుగోలు చేస్తున్నారు. కనీసం వీరి దందాను నియంత్రించే నాథుడే కరువయ్యాడు. దీంతో జీడిపిక్కలు పండించే రైతులు ఏమీ చేయలేక వ్యాపారస్తులు చెప్పిన ధరలకే అమ్ముకోవడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి రైతులది. సాలూరు ప్రాంతంలోనే సుమారు 1500 ఎకరాల్లో జీడి మామిడి సాగవుతుంది. ఎకరానికి ఒక్కొక్క రైతుకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు జీడి పిక్కల పంట దిగుబడి వస్తుంది. కిలో రూ.164 ఉంటే కనీసం ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.90 వేలు వరకు ఆదాయం వస్తుంది. కానీ ఇప్పుడు రేటును అమాంతంగా తగ్గించడంతో ఈ వారం రోజులకే ఒక్కొక్కరు రూ.15వేలు నుంచి రూ.20 వేల వరకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమిషన్ వ్యాపారుల సిండికేట్

ఈ ప్రాంతంలో పండించే జీడిపిక్కలను రైతులు బాగువలసలో ఉండే ముగ్గురు, నలుగురు వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేయడంతో వారంతా సిండికేట్‌గా ఏర్పడి వారికి నచ్చిన ధరలను నిర్ణయించుకొని ఆ ధరలకే రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో దశబ్దాల కిందటి నుంచి జీడీ పంటను రైతులు పండిస్తున్నా నేటికీ ఆ వ్యాపారులే కొనుగోలు చేయడం తప్ప ఇప్పటి వరకు ఈ పంటలను ఎక్కువగా ఎగుమతి అయ్యే పలాస, జైపూర్ ప్రాంతాల నుంచి ఒక్క వ్యాపారి కూడా ఇక్కడికి వచ్చి కొనుగోలు చేయడం అన్నది జరగలేదంటే ఆ వ్యాపారాస్తులు ఎంతటి పలుకుబడి ఉందో అర్థం అవుతుంది.

ఆర్భాటమే తప్ప కొనుగోలు నిల్

జీడి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి బయట మార్కెట్ ధర కంటే కిలోకు రెండు రూపాయిలు అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తామని పాలకులు, అధికారులు ఊరూ వాడా దండోరా వేసి చెప్పారు. అయితే కొనుగోలు మాత్రం మచ్చుకైనా చేయడం లేదు. దీంతో గత్యంతరం లేక తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జీడి రైతులు తీవ్రమైన నష్టాలు బారిన పడుతున్నారు.

ప్రభుత్వమే జీడిపిక్కలను కొనుగోలు చేయాలి

ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా జీడిపిక్కలను కొనుగోలు చేస్తుందని స్థానికంగా ఉండే మహిళా సంఘాల ప్రతినిధులతో చెప్పించారు. కానీ వాటిని కొనేటప్పుడు సవాలక్ష పద్ధతులు విధించారు. డబ్బులు నేరుగా ఇవ్వకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పడంతో బ్యాంకుల్లో కొద్ది గొప్ప అప్పులు ఉండడంతో ఆ డబ్బులను బ్యాంకు వారు ఎక్కడ అప్పులకు జమ చేస్తారోనన్న భయంతో అక్కడ అమ్మడం లేదు. కొనుగోలు కేంద్రాలు కూడా ఎప్పుడూ అందుబాటు లేవు. దీంతో దళారీలకు వారికి నచ్చిన రేటుకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. తూకంలో కూడా తేడాలు ఉన్నాయి. ఇటువంటి మోసాలు అన్నింటినీ కట్టడి చేయడానికి ప్రభుత్వం సరైన పద్ధతుల ద్వారా రైతులకు మేలు చేసే విధానాలను అవలంబించి కొనుగోలు చేయాలి. అలాఅయితే గిరిజనులకు సరైన న్యాయం జరుగుతుంది. జీడిపిక్కలకు నగదును కొనుగోలు కేంద్రాల వద్దనే చెల్లించినట్లయితే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండదు.

కూనేటి సన్యాసి, మెట్ట వలస

పల్లెలకు వెళ్లని ఆర్‌టిసి

బస్సులు నిలిపివేతతో గిరిజనుల అవస్థలు
కాలినడక, ప్రైవేట్ వాహనాలే దిక్కు

ప్రజాశక్తి - సీతంపేట

స్వాతంత్ర్యం వచ్చి సుమారు 75 ఏళ్లు గడుస్తున్నా అనేక గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, ఇళ్లు లేక ఆదివాసీలు అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికీ గిరిజన తండాల్లోకి వెళ్లాలంటే ఆదివాసీలు సరైన రోడ్డు లేక బస్సులు రాక కాలినడక, ప్రైవేట్ వాహనాలపైనే ఆధారపడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ పరిస్థితులు మారడంలేదన్నందుకు ఉదాహరణ పలు గ్రామాల్లోకి ఇప్పటికీ గిరిజనులు కాలినడకలే నిదర్శనం.

మండలంలో గిరిజన గ్రామాలకు రహదారులు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు నిలిపివేయడంతో ఆదివాసీలకు శాపంగా మారింది. కరోనా ముందు కొన్ని బస్సులు నిలిపివేస్తే, మరికొన్ని గ్రామాలకుకరోనా సాకుతో బస్సులు నిలిపివేశారు. కొత్తూరు నుంచి పూతికవలస 80 శాతం రహదారి బాగానే ఉన్నా ఈ గ్రామాలకు బస్సులు నడవడంలేదు. అలాగే వీరఘట్టం - పొల్ల, ధోనుబాయి బస్సు సర్వీసును నిలిపివేశారు. పాలకొండ - దొనుభాయి షటిల్ సర్వీసును కూడా రద్దు చేశారు. పాలకొండ- శంబాం రోడ్డు బాగున్నా బస్సు సర్వీసును నిలిపివేశారు. అలాగే పాలకొండ -సేది, పాలకొండ- తలేబుగూడ, పాలకొండ-కోతాం, పాలకొండ-తొత్తాడి, వీరఘట్టం - ధోనుబాయి ఇలా చెప్పుకుంటూ పోతే చాలా బస్సులు తొలగించడంతో ప్రైవేటు వాహనాలే దిక్కు. అవి కూడా లేకపోతే కాలి నడకతోనే ప్రయాణించి ఇళ్లకు చేరుకుంటున్నారు. అసలు పల్లె వెలుగులు, ఆర్టీసీ బస్సు పల్లెల కోసం వేసినప్పటికీ ఏజెన్సీలో ఎక్కడ మచ్చుకైనా కనిపించవు. సీతంపేటలో ఐటిడిఎ ఉన్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రీవెన్స్‌లో వినతులు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కరించడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ప్రైవేట్ వాహనాలపైన వెళ్తే చేతి చమురు వదిలేస్తుంది. కనీసం అటవీ ఉత్పత్తులు సంతకు తీసుకొని వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ చుట్టుపక్కల గ్రామాలకు గతంలో బస్సులు వెళ్లేవి. అయితే ఈ గ్రామాల చుట్టూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలు, సచివాలయాలు ఉన్నాయి. గిరిజనులతో పాటు అధికార సిబ్బంది కూడా రాకపోకలు సాగిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆర్టీసీ అధికారులు, ఐటిడిఎ అధికారులు స్పందించి బస్సులు మళ్లీ పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు.

బస్సులేక నడిచి వెళ్తున్న గిరిజనులు

ఆదాయం లేక బస్సులు నిలిపివేశాం

శంబాం - పూతికవలస, హడ్డుబంగి, నివగాం తదితర బస్సులు ఆదాయం లేక నిలిపివేశాం. బస్సులో ప్రయాణికులు లేక బస్సులు తొలగించాం. విద్యార్థులకు అయితే తప్పనిసరిగా బస్సులు వేస్తాం. నేను ఈ రూట్‌ను పరిశీలించగా, ఎవరూ బస్సు ఎక్కలేదు. అందుకే సర్వీసులను రద్దుచేశాం.

వెంకటేశ్వరరావు,
డిపో మేనేజర్, పాలకొండ.

పార్వతీపురం నుంచి దోనుబాయికి బస్సు వేయాలి

పార్వతీపురం జిల్లా కేంద్రం నుంచి వీరఘట్టం వయా పొల్ల మీదుగా దోనుబాయికి బస్సు వేయాలి. ఇప్పటికే పాలకొండ నుంచి ధోనుభాయి షటిల్ బస్సు తొలగించారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. ప్రైవేట్ వాహనాల్లో వెళ్తే ఎక్కువ డబ్బులు గుంజేస్తున్నారు.

కూరంగి వెంకినాయుడు, సర్పంచ్,
దోనుబాయి.

శంభాం బస్సు పునరుద్ధరించాలి

శంభాం బస్సు తొలగించడంతో ఇక్కడ గిరిజనులు నాన అవస్థలు పడుతున్నారు.. ఇటీవల కాలంలో రహదారి కూడా మరమ్మతులు చేపట్టారు. రోడ్డు వేసినప్పటికీ బస్సు లేకపోవడం రోడ్డు వేసి ప్రయోజనం కనిపించడం లేదు. ఇక్కడ నుంచి సంతకు అటవీ ఉత్పత్తులు తీసుకొని వెళ్లడానికి భారమవుతుంది. అధికారులు స్పందించి బస్సు వేయాలి.

నిమ్మక తిరుపతిరావు, సర్పంచ్, శంభాం.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు చేయూత

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణానికి చెందిన శ్రీ పార్వతీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కె.రామచంద్రరావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించిన అనంతరం ఇటీవల అనారోగ్యానికి పాలైన పలువురు తోటి ఎలక్ట్రికల్ వర్కర్ల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. వేమకోటి వీధికి చెందిన గొర్లె భగవాన్, వివేకానంద కాలనీకి చెందిన పోలు రాజు, రామాపురం కాలనీకి చెందిన కిషోర్ వివిధ కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని సంఘ సభ్యులు తమకు తోచినంతగా చేసిన ఆర్థిక సహాయం వారిని ఆదుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ సింగిడి శేఖర్, జాయింట్ సెక్రెటరీ మజ్జి శంకర్రావు, కోశాధికారి బొంతలకోటి రత్నాకరరావు, యూనియన్ గౌరవ అధ్యక్షులు సువ్వాడ తవిటిరాజు, భోగి గౌరీశంకర్రావు, సైలాడ శ్రీనివాసరావు, ఎం.అనంతనాయుడు, పి.ఉమామహేశ్వరరావు, యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నవధాన్యాల విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఈనెల 12వ తేదీ నుంచి రాయితీపై నవధాన్యాలు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఎపి సిఎన్ఎఫ్ మారుతి సింహాచలం ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించి విత్తనాలు కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎపి సీఎన్ ఎఫ్ 11 రైతు సేవ కేంద్రాల్లో మ్యాచింగ్ కిట్టు నాలుగు కేజీలు పది రకాల విత్తనాలు రాయితీపై రూ.300లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా 10 కిలోలు విత్తనాలు రూ.648లకు రాయితీపై ఇస్తున్నామన్నారు. మ్యాచింగ్ కిట్టు 2 కేజీలు రాయితీపై రూ.150కి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలు ద్వారా భూసారం పెరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరేష్‌చంద్రదేవ్

కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

ప్రజాశక్తి - కురుపాం

కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు లభిస్తుందని కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకు ఆరేటి మహేష్ అన్నారు. నియోజవర్గంలో మండలాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జియ్యమ్మవలస, కురుపాం మండలాలకు చెందిన టిడిపి కార్యకర్తల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల కన్వీనర్లు కెవి కొండయ్య , పల్లా రాంబాబు అధ్యక్షతన కురుపాంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సంస్థాగత ఎన్నికలైన గ్రామ, మండల కమిటీలు నియామకం కోసం కార్యకర్తలు, నాయకులు అభిప్రాయాలను తెలుసుకొని నివేదికను అధిష్టానానికి పంపిస్తామని తెలిపారు. తుది నిర్ణయాన్ని పార్టీ నిర్ణయిస్తుందని, అందుకు ప్రతి కార్యకర్త కట్టుబడి ఉండాలని అన్నారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరుచర్ల వీరేష్ చంద్ర దేవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని కష్టపడే పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఎంతో కష్టపడి ఎన్నో ఏళ్ళు తరువాత ఎమ్మెల్యేను గెలిపించుకున్నామని, అదే స్ఫూర్తితో ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని కోరారు. అనంతరం ఆపరేషన్ సింధూరలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. సమావేశంలో టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, వెంపటాపు భారతి, రంజిత్ కుమార్ నాయక్, దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, కృష్ణబాబు తదితర మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - కొత్తవలస

దేవాడ గ్రామం వద్ద త్రిబుల్ రైడింగ్ చేస్తూ, డ్రింకింగ్ చేస్తూ ఓవర్ స్పీడ్‌తో ద్విచక్ర వాహనం నడిపిన బండికరస మధు రోడ్డు దాటుతున్న గాడి తాతబాబు(65)ను బలంగా ఢీ కొట్టాడు. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని పోతనపల్లి గ్రామానికి చెందిన పొట్నూరు శివ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ఆదివారం ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ మంటలు ఆరకపోవడంతో వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారని శివ తెలిపాడు. అప్పటికే ట్రాక్టర్ కాలిపోయిందని వాపోయాడు.

ఎబిబి సరిహద్దుల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి -కొమరాడ

ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దు చెక్పోస్టుల వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేస్తున్నట్లు కొమరాడ ఎస్సై కే నీలకంఠం తెలిపారు. ఆదివారం ఎబిబి సరిహద్దు చెక్‌పోస్ట్ అయిన కూనేరు వద్ద ఒడిశా నుంచి వస్తున్న అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు సరిహద్దు ప్రాంతాల్లో వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు మొత్తు పదార్థాలు, గంజాయి, అక్రమ మద్యం వంటి అక్రమ రవాణాపై ప్రత్యేకంగా పెట్టామని తెలిపారు. అధికంగా ఒడిశా ప్రాంతం నుంచి ఆంధ్రాలోకి గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చాయని అన్నారు. అన్ని ప్రైవేట్ ప్రభుత్వ వాహనాలు సైతం క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే వాహనాలను ఆంధ్రాలోకి విడిచి పెడతున్నామని తెలిపారు. అక్రమంగా మద్యం, గంజాయి మత్తు పదార్థాలు అమ్మకాలు చేస్తే పోలీసులకు తక్షణమే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అలాగే గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరించినట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీలను పార్వతీపురంరూరల్ సిఐ గోవిందరావు పర్యవేక్షలో జరిగాయి. తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

సీతంపేట : మండల కేంద్రంలోని దోనుబాయి జంక్షన్ వద్ద వాహనాలను ఎస్సై వై.అమ్మనరావు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కార్లు డిక్కీలు ఓపెన్ చేసి క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కొమరాడలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సాకిగెడ్డ పనులు చేపట్టండి: కాంగ్రెస్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని సాకిగెడ్డ పనులు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఒబిసి పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ తదితరులు మండలంలోని పుట్టూరు-లచ్చిరాజుపేట గ్రామాల మధ్య గల సాకి గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాకిగెడ్డ నుండి వచ్చే నీరు ప్రవహించే వంతెన తూముల మొత్తం చెట్లు తుప్పలు, చెత్త చెదారంతో నిండిపోయాయన్నారు. వర్షా కాలానికి ముందే సాకిగెడ్డలో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు.

ఏడాదిలోపే తండ్రీ కొడుకు మృతి

ప్రజాశక్తి - మక్కువ

మృతి చెందిన జానకీరామ్

ఎనిమిది నెలల క్రితమే తండ్రి మరణం నుంచి కోరుకుంటున్న తరుణంలో పెళ్లీడుకు వచ్చిన కుమారుడు కూడా వాహన రూపంలో మృత్యువాత పడడంతో ఆ కుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. గత ఐదు రోజులుగా వివాహాల్లో బ్యాండ్ వాయించేందుకు వెళ్లి తిరిగి ఇంటి ముఖం పడుతుండగా విజయనగరం జిల్లా బొండపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నాయి బ్రాహ్మణ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారు చోటు చేసుకుంది. మక్కువలోని శ్రీదేవి కాలనీకి చెందిన తుమరాడ జానకీరామ్ అలియాస్ శ్రీను (21) వివాహ వేడుకల్లో సన్నాయిమేళంలో పాల్గొంటూ నాయి బ్రాహ్మణ వృత్తిని కొనసాగిస్తున్నాడు. విజయనగరం నుంచి మక్కువ ద్విచక్ర వాహనంపై వస్తుండగా బొండపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం ఉదయం లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే జానకీరామ్ మృతి చెందాడు. జానకీరామ్ తండ్రి జగన్నాథం అలియాస్ బుజ్జి కూడా 8 నెలలు క్రితం చనిపోవడం, ఇప్పుడు పెళ్లి ఈడికి వచ్చిన కుమారుడు కూడా మరణించడంతో తల్లి రమణమ్మ రోదన స్థానికులను కంటతడి పెట్టిస్తుంది. జానకీరామ్ మృతితో శ్రీదేవి కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి